


# సుబుర్ బాషా

ఒక రాజుగారికి ఏడుగురు కుమార్తెలు. వారి ఆలనాపాలనా అచ్చటా ముచ్చటా అంతా రాజుగారే దగ్గరుండి చూసుకునేవారు.

ఒకరోజు రాజుగారు ఆ ఏడుగురినీ పిలిచి, కబుర్లు చెబుతా, గారాబం చేస్తా 'ఏమ్మా. మీ అందరినీ యింత బాగా చూసుకుంటున్నది ఎవరు? మీరు కోరిందే తడవుగా కొండ మీది కోతినైనా దించి పెడ్తున్నది ఎవరు? మీరు తినడానికి పంచభక్ష్య పరమాణ్ణాలు వండిపెట్టిస్తున్నది ఎవరు? మీ ఒంటిని పట్టుబట్టలతో వజ్ర వైఢూర్యాలతో అలంకరించుకునే ఏర్పాటు చేసింది ఎవరు?' అని అడిగారు.

'మీరే గదా అబ్బాహుజూర్. మీరే మమ్మల్ని చూసుకుంటున్నది. మీరే మాకు తిండి పెడుతున్నది' అని ఏడుగురిలో మొదటి ఆరుగురూ సమాధానం చెప్పారు.

కానీ ఏడో కుమార్తె మాత్రం 'అదేమిటి అబ్బాహుజూర్. యిదంతా అల్లా యిచ్చింది. అల్లా సృష్టించింది. పైవాడు యివ్వకపోతే మీకు ఎక్కడిది. పైవాడు దయ చూపకపోతే మేము ఎక్కడి వాళ్లం. మీరు చేసినా చూసినా యిచ్చినా తీసుకున్నా అంతా పైవాడి దయవల్లే. అందువల్ల నన్ను పెంచుతున్నది మీరు కాదు అల్లా' అంది.

రాజుగారికి యింత పొడుగు వచ్చింది కోపం. వెంటనే భటుల్ని పిలిచి 'ఈ అమ్మిని తీసుకెళ్లి నట్టడవిలో విడిచిరండి. తినడానికి ఒక బస్తా రాగులు పడేసిరండి. చూద్దాం ఆ అల్లా ఈమెను ఎలా పెంచుతాడో' అన్నాడు.

భటులు వెంటనే ఏడో కుమార్తెని తీసుకెళ్లి అడవిలో వదిలేశారు.

అక్కడే ఆ కుమార్తె ఒక గుడిసె వేసుకొని, మూడు పూటలా రాగిరొట్టెలు తింటా, అయిదు పూటలా నమాజు చేసుకుంటా దేవుని ప్రార్థనలో రోజులు గడుపుతా ఉంది.

ఒకసారి రాజుగారు వర్తకానికి విదేశాలకు వెళ్లాల్సి వచ్చింది. వెళ్తా వెళ్తా ఆరుగురు కుమార్తెలను పిలిచి 'మీకేం తేవాలి? మీకేం తేవాలి?' అని అడిగి, వాళ్లు చెప్పినవి రాసుకుని బయలుదేరారు. అయితే ఆయన ఎక్కిన ఓడ ఎంతకీ లంగరు ఎత్తడం లేదు.

ఆ రోజుల్లో ఎవరైనా ఏదైనా మరిచిపోతే ఓడ లంగరు ఎత్తేది కాదంట. నేనేమైనా మరిచిపోయానా అని గుర్తు తెచ్చుకున్నారు రాజుగారు. ఆయనకు ఏడో కుమార్తె గుర్తుకొచ్చింది.

'ఓహో. నా ముఖానికి అదొకతి ఉంది గదా' అనుకొని నౌకర్లను పిలిచి 'ఆ ఏడోదాని కొంపకెళ్లి దానికి ఏం తేవాలో అడిగిరండి' అని పంపించాడు. నౌకర్లు ఆదరాబాదరాగా అడవికి వచ్చారు. అప్పుడు ఏడో కుమార్తె దైవప్రార్థనలో ఉంది.



నౌకర్లు గుడిసె బయట నుంచి 'అమ్మా. మీ అబ్బాహుజూర్ వర్తకానికి విదేశాలు వెళుతున్నారు. మీకు ఏం తెమ్మంటారో అడిగి రమ్మన్నారు' అన్నారు.

అప్పటికి ఏడో కుమార్తె సగం ప్రార్థనలో ఉంది. అందుకని 'సుబుర్' అంది ('కాస్త ఆగండి చెబుతాను' అని అర్థం).

'ఓహో! ఈమెకు సుబుర్ కావాలేమో' అని నౌకర్లు రాజుగారి దగ్గరకు వచ్చి 'మహారాజా. అమ్మాయిగారికి సుబుర్ కావాలంట' అని చెప్పారు. వెంటనే లంగరు ఎత్తింది. ఓడ బయలుదేరింది.

వర్తకంలో రాజు ఎక్కడెక్కడో తిరిగి ఆరుగురు కుమార్తెలకు కావలసినవన్నీ కొన్నాడుకానీ ఏడో కుమార్తె అడిగిన 'సుబుర్' మాత్రం ఆయనకు ఎక్కడా దొరకలేదు. ఎవర్ని అడిగినా 'సుబుర్ ఏంది? సుబుర్ ఏంది?' అని ఆశ్చర్యపోతున్నారు. అప్పుడాయనకు పాతకర్రల వ్యాపారం చేసుకుంటున్న ఒకతను కనిపించాడు.

రాజు వాడి దగ్గరకు పోయి 'నీ దగ్గర సుబుర్ ఉందా?' అని అడిగాడు. ఆ మాట విన్న వ్యాపారి రాజువంక చూసి వీడెవడో తిక్కలోడులాగున్నాడు అనుకొని ఒక పాత బెత్తాన్ని తీసి 'యిదే సుబుర్ అంటే. తీసుకెళ్లండి' అని యిచ్చాడు.

రాజు వెనక్కి తిరిగి వచ్చాడు. ఎవరి వస్తువు వారికి పంపించాడు. ఏడోకుమార్తెకు 'సుబుర్' యిచ్చి వెళ్లారు నౌకర్లు. ఆమె దాన్ని చూసి నవ్వుకొని మూల పడేసింది.

ఒకరోజు ఒక మేకల మంద అటుగా వచ్చి ఏడో కుమార్తె గుడిసె మీదపడి తాటాకులు తినబోయింది. అది చూసి వరె వరె అనుకున్న ఏడో కుమార్తె అనుకోకుండా మూలనున్న సుబుర్ బెత్తాన్ని తెచ్చి మేకల్ని బాదింది. బాదగానే ఆ బెత్తం రెండుగా విడిపోయి ఒక విసనకర్ర బయటపడింది. దాన్ని యిలా ఊపగానే కళ్లు మిరుమిట్లు గొలిపే ఒక అందగాడు ప్రత్యక్షమయ్యాడు.

ఆ పరాయి మగవాణ్ణి చూడగానే గోషాలోకి వెళ్లిపోయింది ఏడో కుమార్తె.

'సిగ్గుపడకు. నేను నీవాణ్ణి. నా పేరు సుబుర్ బాషా. మాది పరేస్తాన్ (గంధర్వదేశం)' అన్నాడు ఆ అందగాడు ఏడో కుమార్తెతో.

'నువ్వు ఈ విసనకర్రను యిలా ఊపితే ప్రత్యక్షమవుతాను. అలా ఊపితే వెళ్లిపోతాను' అని ఆమెకు చెప్పాడు.

అప్పటి నుంచి వాళ్లిద్దరూ అక్కడ ఆకూ పిందెలాగ కలిసిపోయి కాపరం చేస్తూ వున్నారు. వారి కాపురం వల్ల, ఆ గంధర్వుడి రాకపోకల వల్ల వాళ్లుంటున్న గుడిసెకు ఒక వింత వెలుగు వచ్చేసింది. అది అడవిలో ఛక్‌ఛక్‌మని మెరుస్తా ఉంది.

ఇది యిట్లా వుండగా, ఒకనాడు రాజుగారి ఆరుగురు కూతుళ్లు మహల్ మీద నిలబడి అడవిలోకి చూశారు. చూస్తే ఏముందీ ఏడో చెల్లెలి గుడిసె ధగధగమని మెరిసిపోతా కనిపించింది.

'ఏమిటి ఈ వింత. ఈ ఏడోదాని కథేంటో కనుక్కుందాం పాండి' అని ఆరుగురు అక్కాచెల్లెళ్లూ ఒకరోజు సింగారించుకుని సవారించుకొని ఏడో చెల్లెలి దగ్గరకు వచ్చారు. వచ్చి ఆ మాట ఈ మాట చెప్పి, ఆ ప్రేమ ఈ ప్రేమ చూపి, ఆ ఏడుపూ ఈ ఏడుపూ ఏడ్చి 'చెల్లెలా. ఎలా ఉండేదానివి ఎలా అయిపోయావమ్మా' అని పొద్దుపోయినా కదలకుండా ఉండిపోయారు.

సరే అని వాళ్లకు పక్కలేసి, వాళ్లు నిద్రపోయారనుకుని, తన గదిలోకి వెళ్లి విసనకర్ర ఊపింది ఏడో చెల్లెలు. సుబుర్‌బాషా వచ్చాడు. వాళ్లిద్దరూ నవ్వుకుంటూ కబుర్లు మొదలెట్టారు.

యిదంతా చాటు నుంచి చూసిన ఆరుగురు అక్కచెల్లెళ్లకు కడుపులు కాలిపోయాయి.

'యింతటి అందగాణ్ణి మొగుడిగా చేసుకున్న ఈ ఏడోదాన్ని నాశనం చేయాలి' అనుకొని మరుసటి రోజు మహలుకు తిరిగి వెళుతూ, వాళ్ల చేతుల్లోని గాజులన్నీ పగలగొట్టి, నూరి, విషం కలిపి, సుబుర్ బాషా పడుకునే పక్కంతా పూసి వెళ్లిపోయారు. పాపం యిదంతా ఏడో చెల్లెలికి తెలియదు.

ఆ రాత్రి సుబుర్‌బాషా వచ్చి పక్కమీద మేను పరచగానే వళ్లంతా కచకచమని గాజు పలుకులన్నీ గుచ్చుకుపోయాయి. విషం ఎక్కిపోయింది. అల్లాడిపోయాడు సుబుర్‌బాషా.

'త్వరగా విసనకర్ర విసురు. మా దేశం వెళ్లిపోతాను' అనేసరికి విసనకర్ర విసిరింది భార్య. సుబుర్ బాషా ముక్కుతూ మూల్గుతూ వెళ్లిపోయాడు.

ఆ తర్వాత ఎన్నిసార్లు విసనకర్ర ఊపినా రాలేదు. రావాలంటే ఎలా వస్తాడు? తీవ్రంగా జబ్బుపట్టి చావుబతుకుల్లో ఉంటే.

ఏడో కుమార్తె చూసీ చూసీ సుబుర్ బాషా కోసం మగాడి వేషం కట్టి దేశాటనకు బయలుదేరింది. ఆమె తిరిగీ తిరిగీ ఒకసారి ఒక చెట్టుకింద పడుకుంది. అప్పుడు ఆ చెట్టు కొమ్మమీద రెండు గువ్వలు వాలాయి.

'ఒసే ఒసే. జరిగింది చెప్పనా. జరిగేది చెప్పనా' అంది ఒక గువ్వ.

'జరిగింది అందరికీ తెలుసు. జరగబోయేది చెప్పు' అన్నది రెండో గువ్వ.

'యిదిగో ఈ చెట్టు కింద ఒక మగాడు పడుకొని వున్నాడే వాడు మగాడు కాదు. ఫలానా దేశపు రాజు ఏడో కుమార్తె. పరేస్తాన్ రాజకుమారుడైన సుబుర్ బాషాను పెళ్లి చేసుకుంది. కానీ ఈ మహాతల్లికి ఆరుగురు అక్కచెల్లెళ్లు వున్నారు. వాళ్ల పుణ్యమా అని సుబుర్‌బాషాకు ఒళ్లంతా విషం ఎక్కి పొట్టు లేచింది. వాణ్ణి వెతుక్కుంటూ ఈవిడ బయలుదేరింది' అన్నది మొదటి గువ్వ.

'మరి దానికి విరుగుడు' అంది రెండో గువ్వ.

'దానికి లోకంలో మందు లేదు. మన రెట్టే మందు. ఎప్పుడైతే మన రెట్టను తీసుకెళ్లి పూస్తారో అప్పుడే దానికి విరుగుడు' అని చెప్పి, రెట్ట వేసి అక్కడి నుంచి ఎగిరెళ్లిపోయాయి గువ్వలు.

యిదంతా మేల్కొని వింటున్న ఏడో కుమార్తె ఆ రెట్టని సేకరించుకుని కొంగులో చుట్టుకొని పరేస్తాన్‌కి బయలుదేరింది.

అక్కడకు చేరి, దాసరోళ్ల వేషం కట్టి 'మొండిరోగాలకు వైద్యం చేస్తాం. మొండి విషాలకు విరుగుడు యిస్తాం' అని కేకలేస్తూ తిరుగుతూ రాజమహలుకు చేరుకుంది.

అప్పటికే పరేస్తాన్‌లో ఎందరెందరో సుబుర్‌బాషా జబ్బు విరుగుడి కోసం ప్రయత్నించి ఓడిపోయి ఉన్నారు.

అందువల్ల ఏడో కుమార్తెతో 'నువ్వు గనక నా కుమారుని రోగం నయం చేయకపోతే నీ తల తెంచి కోటగుమ్మానికి వేలాడదీస్తాను' అన్నాడు పరేస్తాన్ రాజు.

'సరే మహారాజా' అని, లోపలికి వచ్చి, చావుబతుకుల మధ్య వున్న భర్తని చూసుకొని కన్నీళ్లు పెట్టుకుంది ఏడో కుమార్తె.

పెట్టుకొని, ఆమె దగ్గరున్న గువ్వ రెట్టని కోడి ఈకలో తీసుకొని సుబుర్ బాషా వళ్లంతా పూసింది. ఎప్పుడైతే పూసిందో ఒంటిమీది పొట్టంతా జలజలమని రాలిపోయి విషం గిషం దిగిపోయి తేటగా లేచి నిలబడ్డాడు సుబుర్ బాషా.

అది చూసి సంతోషం పట్టలేక 'అమ్మా. ఏం కావాలో కోరుకో' అన్నాడు పరేస్తాన్ రాజు.

'నాకు నా భర్త కావాలి. ఇప్పించండి' అంది ఏడో కుమార్తె అప్పటివరకూ తను కట్టిన దాసరి వేషం తీసేస్తూ.

సగం పాపిట వెంట్రుకలు బంగారం, సగం పాపిట వెంట్రుకలు వెండి, నాభి నక్షత్రం, నుదురు వైఢూర్యంగా వున్న ఆ అతిలోక సౌందర్యవతిని చూసి రాజుగారు ఎంతో ముచ్చటపడ్డారు. నా కుమారునికి తగిన కోడలు దొరికింది అని సుబుర్ బాషాను ఆమె చేతిలో పెట్టారు.

ఆ భర్తను తీసుకొని, ఏడు పల్లకీలు ఎక్కి, యిరవై ఆరుమంది పరిచారికలను తీసుకొని, అంతులేని సంపదలను వెంటబెట్టుకొని ఏడో కుమార్తె యింటికి వచ్చేసరికి ఏముంది రాజుగారికి రాజ్యం పోయింది. కళ్లు పోయాయి. ఆరుగురు అక్కాచెల్లెళ్లు అడుక్కు తింటున్నారు.

ఏడో చెల్లెలి చెడు కోరుకున్నందుకు గాను వారు గుడ్డ కడితే కాగితంలా చిరిగిపోతోంది. కూడు తింటే బెల్లంలా ముద్దకడుతోంది.

చేసిన తప్పుకు ఖర్మ అనుభవిస్తున్నాం అని వాళ్లందరూ ఏడో కుమార్తె కాళ్ల మీద పడ్డారు. ఆమె వారిని క్షమించి తన దగ్గర ఉంచుకుంది. అప్పటి నుంచి వాళ్లందరూ హాయిగా భోగభాగ్యాలతో కలకాలం జీవించారు.

అప్పట్లో ఈ వింత విని, ఆ రాజ్యం చూడడానికి ఎవ్వరైనా వెళితే చీర, రవికె, గాజులు పెట్టి పంపించేవారు. ఈ కథ చెప్పిన మా పెద్దమ్మ కూడా చూద్దామని వెళితే ఆమెకు కూడా చీరె రవికె పెట్టి పంపారు.